# నిచ్చెనమెట్లు

## వేంపల్లి రెడ్డినాగరాజు

**"ఏం చిన్నాయనా నాలుగేండ్లుగా పట్టిండే దరిద్రమంతా ఒక్కసారిగానే వొదిలిపొయ్యేటట్లుగా ఈసారి భలే ఛాన్సు కొట్టినట్లుండావే" బీడీదమ్ము గుండెలనిండుగా లాగుతూ మరో రెండు వారాల్లో కోతకు రానున్న ప్రొద్దుతిరుగుడు పంటవంక జూస్తూ అడిగాడు నారాయణ.**

"నాదేం ఛాన్సులేరాబ్బీ, మీ నాయన మాదిర్తో నేనేమన్నా టౌనులో ప్లాట్ల యాపారం జేసేటోల్లకాడ 'బ్రోకర' పన్జేసి రోజూ రెండు చేతులా సంపాదిస్తాండానా ఏంది?" చుట్టూ పచ్చని రేకులతో చూడముచ్చటగా వున్న పువ్వులతో కళకళలాడుతున్న పైరుమధ్య దిష్టిబొమ్మను ఏర్పాటు చేస్తున్న కొండయ్య ఎదురు ప్రశ్నించాడు.

"ప్లాట్ల యాపారంలో నాలుగు రూకలు కళ్ళజూడల్లంటే ఎన్ని అపద్దాలు, ఎన్ని సపద్దాలు చెప్పల్లనో నీకు తెలీనిదా చిన్నాయనా" ఆరిపోతున్న బీడీని మరింత గట్టిగా దమ్ములాగుతూ అన్నాడు నారాయణ.

"ఉప్పుదిన్నంత దప్పిశానా అని మీ నాయనట్లాటోల్లను జూసేరా పెద్దోల్లు శాస్తరం జెప్పిండేది" తనూ బీడీ వెలిగించుకుంటూ అన్నాడు కొండయ్య.

"చిన్నాయనా నువ్వేమనుకోనంటే ఒక మాట చెబుతా"నన్నాడు నారాయణ.

ఏమిటన్నట్లుగా చూశాడు కొండయ్య.

"గాలివున్నెప్పుడే తూరుపెత్తుకోవల్ల అన్నెట్లుగా కాలమెట్లొస్తే మనమూ అట్ల బోవల్లగానీ దారం గట్టుకోని కుచ్చుంటే అయ్యేపనేనా?" గొంతులో కాస్తంత నిష్ఠూరాన్ని రంగరించి అన్నాడు నారాయణ.

"ఏందిరా నీ యవ్వారం గుడ్డొచ్చి పిల్లనెక్కిరించినట్లుందే" ఈసారి మందలింపు ధోరణి కనిపించింది కొండయ్య మాటల్లో.

నారాయణ తను కూడా ఏం తక్కువ తినలేదన్నట్లుగా "మీ తమ్ముడు రామక్రిష్ణను చూసన్నా నేర్చుకో చిన్నాయనా, దున్నుకునేదానికి ఆయప్పకూ నీకున్నెంత బూమే వున్నా ఈ పట్టిపిసికేపని మానుకోని బెల్టుషాపు పెట్టుకోని కడపులో సల్ల కదలకుండా కాలుమింద కాలేస్కోని సంపాదిస్తాండాడు" అన్నాడు నారాయణ.

"ఏందిరా నారిగా నీ యవ్వారం జూస్తావుంటే పైసాకోసం పెంట తినమని చెప్పేటట్లుందే, నీకు మా రామకిష్టిగోడు దొంగగా బ్రాందీ అమ్మి సంపాదిస్తావుండేదే కనిపిస్తాండాదిగానీ మగపిల్లకాయలను, మా మొగుల్లను 'మందు' మరిపించి చెడగొడతాండావని వూర్లో ఆడోల్లు, పెద్దోలు కొడతావుండే 'మెట్టిదెబ్బలు' నీ కంటికి కనిపించనట్లుందే" పట్టరాని కోపంతో వూగిపోతూ అన్నాడు కొండయ్య. "అదిగాదు చిన్నాయనా నిన్ను తప్పుడుపని చెయ్యమనిగాదు నేను చెప్పేది" పరిస్థితి చేయిదాటుతోందని గ్రహించిన నారాయణ ఏదో సర్దిచెప్పేందుకు ప్రయత్నించాడు.

"ఏదో నాలుగేండ్లు వానలు పడనంత మాత్రాన తాతముత్తాతల కాలంనుండీ తినేదానికి తిండిగింజలిచ్చిన బూములంటే ఎంత చులకనరా నీకు, మీ నాయన మీ తాత గూడా ఇట్లనే అనుకోనుంటే మీరంతా పంచెలుగట్టే మొగోల్లుగా అయ్యిందురా?" నారాయణ మీదకు మరోసారి దూకబోయాడు కొండయ్య రొప్పుతూ.

"వియ్యమందుకునేదానికి వచ్చిండేటోల్లను వీధిలో నిలబెట్టి చేనికాడ కయ్యానికి కాలుదువ్వుతాండీ నీయవ్వారం బాగానే వుండాదప్పా" అంటూ వగరుస్తూ వచ్చాడు కొండయ్య బావమరిది వెంకటేశు.

"వియ్యమందేటోల్లు ఎవుర్రా?" ఏం అర్థంగాని కొండయ్య ప్రశ్నించాడు వెంకటేశువంక చూస్తూ.

"ఇన్నేండ్లుగా నీ మతిమరుపుతో మాయక్కపట్ల ఏగుతాందోగానీ పిల్లను చూసునేటోల్లు ఈరోజు వొస్తామని వారం దినాలకు ముందే చెప్పి పంపించేది గమనంలేదా?" విసుగును ప్రదర్శించాడు వెంకటేశు.

కథ

"ఔనన్నట్లు"గా చూశాడు కొండయ్య బావమరిదివైపు.

"వచ్చిండేటోల్లంతా ఇంటికాడనే వుండారు గానీ బిరిగా పోదాంపా" తొందరచేశాడు వెంకటేశు.

"నేను ఇంటికాడ లేనని వచ్చిండేటోల్లు ఏమన్నా అనుకున్నారేమోరాబ్బీ" గాభరాగా ప్రశ్నించాడు కొండయ్య.

"అదేంలేదుగానీ ఇప్పుడికన్నా యల్లబారు" మరింత తొందర చేశాడు వెంకటేశు.

"నేనిప్పుడు ఇంటికాడికొస్తే ఈడ ఎవురుంటారప్పా?" పైరువంక చూస్తూనే దిగులుగా ప్రశ్నించాడు కొండయ్య. దట్టంగా గింజలు పట్టిన పువ్వులపై పక్షులు వాలి నష్టం కలిగిస్తాయన్న ఆందోళన కొండయ్య కళ్ళలో ప్రతిఫలించింది.


పరిస్థితి అర్థం చేసుకున్న నారాయణ కల్పించుకుంటూ "చిన్నాయనా కరెంటు వొచ్చేదానికి ఇంకా రెండుగంటలు పైగానే పట్టేటట్లుందిగానీ నీ చేను ఎవురూ ఎత్తకపోకుండా నేను ఈడనే వుంటాను తొందరగా పోయ్ రాపో" అన్నాడు అక్కడేవున్న కానుగచెట్టు నీడలో చతికిలబడి మరో బీడీని వెలిగించుకుంటూ.

"నువ్వేందో మాట్లాడినావని కోపంలో వుండి నేననిండే మాటలన్నీ మనసులో పెట్టుకోగాకురా నారాయణా" అభ్యర్థనగా అడిగాడు కొండయ్య.

"ఈ పరాచికాలన్నీ మనకు మామూలేగానీ నువ్వుపోయి జరిగేపని చూడుపో చిన్నాయనా" అన్నాడు నారాయణ.

"చిలకలు, గువ్వలు వొచ్చే పొద్దయ్యిండాది, నువ్వు ఏమాత్రం ఏమారినా పంటదక్కదురోయ్" హెచ్చరించాడు వెంకటేశు.

"నువ్వు నాకేం జెప్పాకు గానీ చిన్నాయన వచ్చేటప్పుడు బీడీకట్ట, అగ్గిపెట్టె పంపిచ్చు



ఎంగటేశుమామా" పరుగులు తీస్తున్నట్లుగా పల్లెవైపు అడుగులు వేస్తున్న కొండయ్య, వెంకటేశులకు వినిపించేలా గట్టిగా అరచి చెప్పాడు నారాయణ.

** ** **

"ఏం చిన్నాయనా కాయా? పండా?" జేబులో నుండీ బీడీకట్ట, అగ్గిపెట్టె తీసి తన చేతిలో పెడుతున్న కొండయ్యను అడిగాడు నారాయణ.

"దేవుని పున్యాన సమ్మందం కుదిరేటట్లే వుందప్పా" మొహంలో సంతోషం కనిపిస్తుండగా చెప్పాడు కొండయ్య.

"వియ్యమందేటోల్లది ఏ వూరు చిన్నాయనా" మళ్ళీ అడిగాడు నారాయణ.

"వాల్లు గూడా మన మాదిరిగానే పల్లెలో పుట్టి పెరిగినోల్లేనంట్రా, పిల్లోనికి ఎలిమెంట్రీ ఇస్కూల్లో ఐవేరిగా ఉద్యోగం వస్తే నాలుగేండ్లబట్టీ టౌనులో వుండారంట, మన పాప నచ్చిందని, అన్నీ కుదిరితే 'మంచిమాట' చేసుకునేదానికి వచ్చేవారం వాల్ల ఇంటికి రమ్మని చెప్పినారు" చెప్పాడు కొండయ్య.

"పోనీలే చిన్నాయనా ఇన్నాల్లకైనా బిడ్డకు పెండ్లి కుదిరి నీ ఇంట్లో పప్పన్నం తినే బాగ్యం కలుగుతాంది, ఆయమ్మి ఈడోల్లందరికీ నాలుగైదు ఏండ్లకు ముందే పెండ్లిండ్లయి ఒకరిద్దరు బిడ్డలు గూడా కలిగినారు" అన్నాడు నారాయణ తను బీడీ వెలిగించుకుని మరొకటి కొండయ్యకు అందిస్తూ.

"అన్నీ బాగనే వుండాయిగానీ యాభైవేలు లెక్క, పది తులాల బంగారు అడిగినార్రాబ్బీ" శూన్యంలోకి చూస్తూ చెప్పాడు కొండయ్య.

"మనమాదిరీ మట్టిపిసికే పనిగాకుండా రోజులు లెక్కబెట్టుకోని జీతం తీసుకునే గవుర్మెంటు పనిజేసేటోడు ఆమాత్రమైనా అడగడా ఏంది" ఆందోళనగా వున్న కొండయ్యవంక జూస్తూ ప్రశ్నించాడు నారాయణ.

"నీకు తెలీకుండా నాదెగ్గిర అంత లెక్క యాడుండాదిరా" ఎదురు ప్రశ్నించాడు కొండయ్య దిగులుగా చూస్తూ.

"రెండు వారాల్లో పంట కోతకొస్తాదిగదా, అమ్మేసి పిల్లపెండ్లి కానిచ్చేస్తే సరిపాయె" మార్గం సూచిస్తున్నట్లుగా చెప్పాడు నారాయణ?

"పంట అమ్మితే వచ్చేలెక్కలో పావలా భాగం టౌనులో ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు తెచ్చినోల్లకు సరిపోగా కూలోల్లకు ఇచ్చేదానికి రంగన్నమామ కాద తెచ్చిండేదానికి ఇంకో పావలా భాగం కట్టల్ల కదప్పా, మిగిలిండే లెక్కతో బంగారమే కొనల్లనా, వాల్లు అడిగిండే ఇనామ్ ఇయ్యల్లనా?" ఆవేదనతో మాట గట్టిగా రావడంలేదు కొండయ్యకు.


"అప్పులోల్లకు పోనూ మిగిలిండే సొమ్ముకుతోడు ఎవరిదెగ్గిరన్నా పరపతికి లెక్క తెచ్చుకోరాదా?" మళ్ళీ సలహాగా చెప్పాడు నారాయణ?

"పరపతి యాపారం జేసేటోల్లు నాయట్లాసేద్దిగాల్లకు లెక్కలిచ్చే రోజులు ఇంగా యాడివప్పా" అడిగాడు కొండయ్య.

"అప్పు పుట్టకుంటే పోనీగానీ బిడ్డకు ఇన్నాల్లకు కుదిరిండీ మంచి సంబంధం చెడగొట్టుకోకుండా ఎంగటేశు మామను రోంతలెక్క అడగరాదా?" చెప్పాడు నారాయణ.

"వాడు గూడా మొన్ననేగదరా కూతురిపెండ్లి జేసిండీ, నాకూ, నీకూ తెలీకుండా యాడుండబ్బీ లెక్క" బదులిచ్చాడు కొండయ్య.

"నాలుగేండ్లుగా లేని వానలు ఈసారి కురిసి పంట బాగనే పండింది. వియ్యమందేటోల్లు గూడా వాల్లంతట వాల్లే వచ్చి బిడ్డను చేసుకుంటామని చెప్పినారు, అన్నీ అవే కుదురుతాయిగానీ నువ్వేమీ


కథా నిలయం

బెంగపెట్టుకోగాకు" కొండయ్యకు ధైర్యం చెబుతూ కరెంటు రాగానే తమ పొలంవైపు వెళ్ళిపోయాడు నారాయణ. చుట్టూ చీకట్లు పరుచుకున్న విషయం గుర్తించిన కొండయ్య తను కూడా డబ్బుగురించి, సర్దుబాటు కాకుంటే సంబంధం వదులుకోవాల్సి వుంటుందన్న బెంగ వెంటాడుతుండగా పరిపరివిధాలుగా ఆలోచిస్తూనే ఇల్లు చేరుకున్నాడు.

పొలం వద్దనుండీ వచ్చిన భర్త మొహంలో ఏదో పోగొట్టుకున్నట్లుగా వున్న భావాల్ని గ్రహించిన కొండమ్మ కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళు అందించి కొండయ్యకు భోజనం వడ్డించింది. ప్లేటుముందు కూర్చున్న కొండయ్య అన్నాన్ని వ్రేళ్ళతో కెలుకుతున్నాడేగానీ ఒక్కముద్ద కూడా నోట్లో పెట్టుకోవడంలేదు. అంతా గమనిస్తూనే వున్న నీలమ్మ విషయం ఏమిటని అడుగుదామనుకుందిగానీ మళ్ళీ భర్త తనే చెబుతాడని వూరుకుంది.

** ** **

"ఏమయ్యా ఎన్నిసార్లు చెప్పినా నీకు అర్థంకానట్లుందే, సినిమాల్లో వేషాలు కావాలంటూ వెంటబడి నా ప్రాణాలు తోడేస్తున్నావు, ఒకప్పుడు వెండితెర వేల్పులుగా వెలుగొందినవారికే నేడు ఇండస్ట్రీలో దిక్కులేదు, యాక్షన్ అనే పదానికి స్పెల్లింగ్ కూడా తెలియని నీకు వేషాలెలా ఇచ్చేది?' గత రెండు నెలలనుండీ కనీసం వందసార్లన్నా తనను కలిసి విసిగించిన శంభుప్రసాద్‌పై మరోసారి విరుచుకుపడ్డాడు ప్రముఖ డైరక్టర్ మహేంద్రనాథ్.

"చిన్నప్పటినుండీ సినిమాలపై వ్యామోహంతో చదువు కూడా ఒంటబట్టించుకోక ఇంట్లో నుండీ పారిపోయి వచ్చేశాను సార్, ఎందరికో అవకాశాలిచ్చిన మీరే నన్ను ఆదుకోకుంటే ఆత్మహత్య చేసుకోవాల్సి వుంటుంది" కారు దిగి ఇంట్లోకి వెళ్ళబోతున్న మహేంద్రనాథ్ కాళ్ళపై మరోసారి పడిపోయాడు శంభుప్రసాద్.

"సంవత్సరాల తరబడీ లక్షల రూపాయలు తగలేసి ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో శిక్షణ పొంది వస్తున్నవారికే దిక్కులేదు, ఇక నీలాంటి వాళ్ళను ఈ జనాలు ఏం వుద్ధరిస్తారుగానీ వచ్చినదారంబడే ఇంటికి వెళ్ళు" మరోసారి కసురుకున్నాడు డైరక్టర్ తన కాళ్ళను విడిపించుకునే ప్రయత్నం చేస్తూ. ఈ లోగా జేబులో వున్న సెల్‌ఫోన్ మ్రోగడంతో చెవికి ఆనించుకుని కాల్ అటెండ్ అయ్యాడు. అవతలివైపు ఎవరు మాట్లాడుతున్నారోగానీ ఇవతలివైపు వింటున్న డైరక్టర్ మొహంలో శంభుప్రసాద్‌పై ప్రదర్శించిన కోపం, విసుగు స్థానంలో ఆందోళన కనిపించసాగింది. అవతలి వైపు నుండీ సంభాషణ కట్ కావడంతో గాభరాగా ఇంట్లోకి అడుగులు వేయబోయినవాడల్లా తన ప్రయత్నాన్ని విరమించుకుని రెండు చేతులూ జోడించి తనకు సమీపంలోనే నిల్చుని వున్న శంభుప్రసాద్‌ను దగ్గరకు రమ్మన్నట్లుగా పిలిచాడు. మళ్ళీ కాళ్ళమీద పడబోతున్న శంభుప్రసాద్ ప్రయత్నాన్ని అడ్డుకుని "ఇంతకీ మీది ఏ వూరన్నావ్?" ప్రశ్నించాడు.

**పొలం వద్దనుండీ వచ్చిన భర్త మొహంలో ఏదో పోగొట్టుకున్నట్లుగా వున్న భావాల్ని గ్రహించిన కొండమ్మ కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళు అందించి కొండయ్యకు భోజనం వడ్డించింది. ప్లేటుముందు కూర్చున్న కొండయ్య అన్నాన్ని వ్రేళ్ళతో కెలుకుతున్నాడేగానీ ఒక్కముద్ద కూడా నోట్లో పెట్టుకోవడంలేదు.**

ఇన్నిసార్లు తిరిగినా పట్టించుకోని డైరక్టర్ ఈరోజు విచిత్రంగా తన గురించి అడగడంతో ఇది కలా? లేక నిజమా అనే సందేహం కలిగింది శంభుప్రసాద్‌కు.

"నిన్నేనయ్యా అడిగేది?" మరోసారి గద్దించాడు మహేంద్రనాథ్. ఈరోజు అదృష్టదేవత తన పక్షాన వున్నట్లుగా పొంగిపోతూ "మీరు అప్పుడప్పుడూ షూటింగ్‌ల నిమిత్తం వచ్చే తలకోన సమీపంలోని చిన్న గొట్టిగల్లు ప్రాంతం సార్" హుషారుగా, అతి వినయంగా బదులిచ్చాడు శంభుప్రసాద్.

జేబులోనుండీ సెల్‌ఫోన్ తీసి మళ్ళీ మరో పదినిముషాలసేపు ఎవరితోనో మాట్లాడిన డైరక్టర్ మహేంద్రనాథ్ శంభుప్రసాద్ వంక చూస్తూ లోనికి రావయ్యా, అంటూ తన వెంట రమ్మన్నట్లుగా చెప్పాడు. నిజంగా మతిపోయినంతవాడిలా యాంత్రికంగానే అడుగులు వేస్తూ తనకు దక్కిన అవకాశానికి మురిసిపోతూ డైరక్టర్ ఇంట్లోకి వెళ్ళాడు శంభుప్రసాద్.



మా మామయ్య మాత్రం ఇంకా వ్యవసాయం చేస్తూనే వున్నాడు సార్, మీరు సరేనంటే అతడిని ఒప్పించి మన షూటింగ్ జరిగేలా చూస్తాను

'ఓ ప్రముఖ హీరో నటిస్తున్న సినిమా షూటింగ్ ఓ పాట చిత్రీకరణ మినహా మిగతా అంతా పూర్తయిపోయిందయ్యా, హీరోగారి షెడ్యూల్స్ గడువు మరో పది రోజులు మాత్రమే వుంది, ఈలోగా పూర్తికాకుంటే ఆయన విదేశాలకు వెళ్ళి మరో మూడునెలలదాకా వచ్చే అవకాశమే లేదు" చెప్పడం ఆపి సాలోచనగా చూశాడు డైరక్టర్. "ఇంతకీ నేనేం చేయాలో చెప్పండి సార్" ఆత్రుతగా ప్రశ్నించాడు శంభుప్రసాద్.

"నాచురల్‌గా వుండాలన్న వుద్దేశంతో ఈ పాటను పచ్చని పంట పొలాల మధ్య తీయాల్సిందిగా స్వయంగా హీరోగారే అడిగారు, ఆ రకమైన సీన్లన్నీ నా సినిమాలు హిట్ కొట్టడానికి సెంటిమెంటల్‌గా ఓ కారణమని అందరికీ తెలిసిందే కదా" చెప్పడం మళ్ళీ ఆపాడు డైరక్టర్.

"ఆ పాటలో హీరోవెనుక వుండే జూనియర్ ఆర్టిస్టుల్లో నన్ను కూడా వుండమంటారాసార్ నరాలు తెగే ఉత్కంఠను తట్టుకోలేనట్లుగా అడిగాడు శంభుప్రసాద్.

"నీకు అన్నింటికీ కాస్తంత తొందర ఎక్కువున్నట్లుందే" గట్టిగానే కసురుకున్నాడు డైరక్టర్. ఓ నిముషంసేపు ఆగి మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు. పాట షూటింగ్ కోసం ఇదివరకే కోనసీమ ప్రాంతాన్ని ఎంచుకున్నామనీ, అయితే చివరిక్షణంలో తాను విదేశాలకు వెళ్ళబోయే ముందు తాను తిరుమల వెంకన్నను దర్శించుకోవాలన్నందున హీరో గారి కోరికమేరకు పాట చిత్రీకరణను తిరుపతి పరిసర ప్రాంతాలకి మార్చుకోవాల్సి వస్తోందని చెప్పాడు.

"ఇంత చిన్న విషయానికే మీరు అంతగా డీలా పడిపోతే ఎలా సార్, తలకోన పరిసరాలు తిరుపతికి దగ్గరే కాబట్టి అక్కడే షూటింగ్ జరిపితే అటు హీరోగారి స్వామికార్యం, ఇటు మన స్వకార్యం రెండూ ఒకేసారి ముగుస్తాయి కదా" ఉత్సాహంగా చెప్పాడు శంభుప్రసాద్.

"నువ్వు చెప్పే ఆలోచనయితే నాకూ వుందిగానీ వర్షాలు కురవడం లేదన్న కారణంగా నాలుగేళ్ళ కాలంగా ఆ ప్రాంత రైతులందరూ వ్యవసాయం మానేసి వున్న భూములను తెగమ్ముకుని సమీప పట్టణాలకు వలసవెళ్ళారని తెలిసిందయ్యా" అన్నాడు డైరక్టర్ మహేంద్రనాథ్.

"మీరు విన్నమాట నిజమేగానీ మా వూళ్ళో మా మామయ్య మాత్రం ఇంకా వ్యవసాయం చేస్తూనే వున్నాడు సార్, మీరు సరేనంటే అతడిని ఒప్పించి మన షూటింగ్ జరిగేలా చూస్తాను". ఆత్మవిశ్వాసం తొణికిసలాడింది శంభుప్రసాద్ కళ్ళలో.

"మీ మామయ్య పంటపొలాల్లో షూటింగ్ జరిగే ఏర్పాట్లు చేయిస్తే నేను త్వరలో తీయబోయే మరో సినిమాలో నిన్ను ఖచ్చితంగా తీసుకుంటానయ్యా" మహేంద్రనాథ్ తను కూడా  భరోసా ఇచ్చాడు ఏ విషయం మరో రెండు రోజుల్లోగా తేల్చిచెప్పమని ఇక వెళ్ళమన్నట్లుగా చూస్తూ. మరో కొద్దిరోజుల్లో తనను వెదుక్కుంటూ రానున్న అవకాశాల గురించి ఆలోచిస్తూ ఆనందంగా వెళ్ళిపోయాడు శంభుప్రసాద్.

** ** **

"మామయ్యా బావున్నావా? అని వినిపించడంతో డబ్బు సర్దుబాటు కాకుంటే కూతురు సంబంధం ఏ రకంగా చేయిజారి పోతుందోనన్న దీర్ఘాలోచనలో వున్న కొండయ్య ఆవైపు దృష్టి సారించాడు. ఎదురుగా తన చెల్లెలు కొడుకు సాంబయ్య వస్తూ కనిపించాడు.

"రారా సాంబయ్యా ఎప్పుడొచ్చినావు వూర్లోకి?" ప్రశ్నించాడు బీడీ పొగ వదులుతూ.

"నన్ను సాంబయ్యా అని పిలవద్దని, నా పేరు శంభుప్రసాద్‌గా మార్చుకున్నానని ఎన్నిసార్లు చెప్పాలి మీకు" రవ్వంత అసహనం కదలాడింది శంభుప్రసాద్ గొంతులో.

"నీకింకా ఆ సినిమాల పైత్యం వొదిలినట్లు లేదు కదప్పా?" ఆరునెలల క్రితం వూరునుండి వెళ్ళినప్పటికీ ఇప్పటికీ సాంబయ్య నడకలోనూ, వేషభాషల్లోను వచ్చిన తేడాను గమనిస్తూ అన్నాడు కొండయ్య.

"నీ మాటలకేంగానీ నేను త్వరలో మూడు, నాలుగు సినిమాల్లో నటించబోతున్నాను" చేతిలోని కళ్ళద్దాల్ని గిరగిర తిప్పుతూ బదులిచ్చాడు శంభుప్రసాద్.

"పంటలు పండక, అప్పులు తీరక మీ నాయన పురుగులమందు తాగి సచ్చిపోతే ముండగల్లురాలయిన మీ అమ్మకు తోడుగా వుండాల్సిందిపోయి దేశాలు పట్టిపోయినావు, ఇప్పుడన్నా ప్రయోజకుడివైతే నాకింకేం కావల్లరా" దీర్ఘంగా నిశ్వశిస్తూ అన్నాడు కొండయ్య.

"నేను ఆ సినిమాల్లో నటించాలంటే నువ్వు ఓ చిన్న సహాయం చేయాలి మామయ్యా" అడిగాడు శంభుప్రసాద్ అభ్యర్థిస్తున్నట్లుగా.

సందేహంగా అతడివైపు చూశారు కొండయ్య.

సినిమా డైరక్టర్ మహేంద్రనాథ్‌కు తనకు మధ్య జరిగిన సంభాషణను డైరక్టర్ అవసరాన్ని గురించి చెప్పాడు శంభుప్రసాద్.

"ఏందిరా నువ్వు మాట్లాడేది, నీకేమన్నా తెలివుందాదా, లేదా? చేతికొచ్చిందే పంట మధ్యన సూటింగ్ జేసుకోనిస్తే వాళ్లు పంటనంతా తొక్కేసిపోరా?" కోపంగానే అడిగాడు కొండయ్య.

"నేను చెప్పేది నువ్వు పూర్తిగా వినడంలేదు మామయ్యా, పంట మొత్తం అమ్మగా నీకు వచ్చే మొత్తంకంటే రెండింతల సొమ్ము సినిమా వాళ్ళే ఇస్తారుగదా" చెప్పాడు శంభుప్రసాద్ తన అవకాశం ఎక్కడ చేయి జారిపోతుందోనన్న భయంతో అనుమానంగా చూస్తూ.

మేనల్లుడి నోట వెంట 'రెండింతల డబ్బు' అన్న మాట వినిపించడంతో అప్పటివరకు ఆవేదనగా వున్న కొండయ్య మొహంలోకి ఓ రకమైన వెలుగొచ్చింది. "అట్ల కుచ్చోరాబ్బీ" అన్నాడు. పది ఎకరాల విస్తీర్ణంలో సాగులో వున్న ప్రొద్దుతిరుగుడు పంటకోసం ఇప్పటివరకు తను సుమారు ముప్పైవేల వరకు ఖర్చు చేయగా కోత సమయంలో కూలీలకు, నూర్పిళ్ళకు కనీసం మరో నాలుగు వేలన్నా ఖర్చు చేయాలి. పంట పూర్తిగా అమ్మితే ఇప్పుడున్న రేట్ల ప్రకారం అరభైవేలు చేతికి వచ్చినా పెట్టుబడుల కోసం చేసిన అప్పులన్నీ తీర్చగా మిగిలేది ఇరభై వేలు మాత్రమే. అదే సాంబయ్య చెప్పినట్లుగా సినిమావాళ్ళు షూటింగ్ జరుపుకునేందుకు అంగీకరిస్తే అప్పులు తీరడంతోపాటుగా కూతురిపెళ్ళి ఏ ఆటంకం లేకుండా ఎలాగోలా పూర్తవుతుంది" ఈ రకంగా సాగుతున్నాయి కొండయ్య ఆలోచనలన్నీ. ఆలోచనల నుండీ తేరుకున్న కొండయ్య "వాళ్ళు ఏమాత్రం ఇస్తారప్పా?" ప్రశ్నించాడు.

"లక్షదాకా కూడా వాళ్ళు రెడీనే మామయ్యా" చెప్పాడు శంభుప్రసాద్.

"లెక్క గ్యారంటీగా ఇస్తారా?" మళ్ళీ అడిగాడు కొండయ్య.

"డబ్బు పూచీ నాదికదా మామయ్యా" నమ్మకంగా చెప్పారు శంభుప్రసాద్ తన సమస్యకు మేనల్లుడిద్వారా, అందునా ఎందుకూ కొరగానివాడిగా ముద్రపడిన సాంబయ్యద్వారా ఇంత సులువుగా పరిష్కారం లభించనుండడంతో 'సరే'నన్నాడు కొండయ్య. విషయం తెలిసి కోతకు సిద్ధంగా వున్న పంటమధ్యలో షూటింగ్ జరిగితే పంట దెబ్బతినే అవకాశం వుందంటూ మందలించబోయారు వెంకటేశు, నారాయణలు. షూటింగ్ వల్ల రాబోయే డబ్బు గురించి, తీరనున్న తన అవసరం గురించి, ప్రత్యేకించి సాంబడిద్వారా తనకు, తన ద్వారా సాంబడికి పరస్పరం జరగనున్న 'సాయం' గురించి చెప్పాడు కొండయ్య.

** ** **

ముందుగా అనుకున్న ప్రకారం సినిమా యూనిట్ సభ్యులు, హీరో

హీరోయిన్‌తో పాటుగా జూనియర్ ఆర్టిస్టులు అందరూ రావడంతో నిర్ణయించుకున్న ప్రకారం ఏపుగా పెరిగి చూసేందుకు ముచ్చట గొలుపుతున్న కొండయ్య ప్రొద్దుతిరుగుడు పొలాల మధ్య షూటింగ్ ప్రారంభమైంది. కనుచూపుమేరా పచ్చని నిగారింపుతో వున్న పైరువంక చూసిన డైరక్టర్ మహేంద్రనాథ్ కళ్ళతోనే శంభుప్రసాద్ వంక మెచ్చుకోలుగా చూశాడు. దీంతో ఇక తన సినిమాఛాన్సులకు ఏ రకమైన ఢోకా లేదనుకున్నాడు శంభుప్రసాద్.

షాట్ రెడీ, ఓ.కే., టేకాఫ్, కట్ కట్ వంటి పదాల మధ్య ఉదయం పది గంటలకు ప్రారంభమైన షూటింగ్ మూడు గంటల ప్రాంతంలో పూర్తి కావచ్చింది. షూటింగ్ ముగియగానే తమ అభిమాన హీరో, హీరోయిన్లతో చేతులు కలిపేందుకు, ఆటోగ్రాఫ్‌లు తీసుకునేందుకు, రక్తతిలకాలు దిద్దేందుకు అభిమాన సంఘాలవాళ్ళు, పరిసర పట్టణాల్లోని కళాశాలల నుండీ వచ్చిన వేలాదిమంది విద్యార్థులు ఒక్కసారిగా పొలం మధ్యలోకి జొరబడ్డారు. దీంతో నిటారుగా వున్న పైరంతా పూర్తిగా నేలకు వాలిపోయింది.

పరిస్థితి చేయి దాటిపోతుందన్నట్లుగా గ్రహించిన పోలీసులు తమ చేతుల్లోని లాఠీలకు పని కల్పించడంతో వాతావరణం మరింత గందరగోళంగా తయారయ్యి మరో గంటకంతా సర్దుకుంది. సినిమా యూనిట్‌వాళ్ళు తమ లగేజీలను తీసుకుని వచ్చిన వాహనాల్లో వెళ్ళిపోవడంతో అప్పుడు గుర్తుకువచ్చింది కొండయ్యకు మేనల్లుడు సాంబయ్య చెప్పిన డబ్బు సంగతి. చుట్టూ కలయజూశాడుగానీ మేనల్లుడు ఎక్కడా కనిపించలేదు.

"ఒరేయ్ ఎంగటేశు నీకేమన్నా మన సాంబడు కనిపించినాడా?" అటువైపుగా వచ్చిన బావమరిదిని ఆత్రుతగా ప్రశ్నించాడు.

"అదేంది మామా సాంబయ్య సూటింగు జరిగేటప్పుడు నెత్తిన టోపీ పెట్టుకోని అరుస్తాండే పెద్దాయిన కారులో ఎల్లబారిపాయ. నువ్వు చూళ్ళేదా?" ఎదురు ప్రశ్నించాడు వెంకటేశు.

"వాడు మనకు ఇప్పిస్తాననిండే లెక్క ఇంగా మన చేతుల్లోకి రాలేదురా" బొంగురుపోయిన గొంతుతో చెప్పాడు కొండయ్య. ఇద్దరూ కలసి సాంబయ్య ఇంటికి వెళ్ళారు.

"ఏమ్మే సాంబయ్య లేడా?" అడిగాడు కొండయ్య చెల్లెలు సునందమ్మను.

"సినిమావాల్లు తిరప్తిలోనే ఇంగా రెండ్రోజులు వుంటారంటగదన్నా, ఈ రెండుదినాలూ వాళ్లకాడనే వుంటానని చెప్పిపాయనే", బదులిచ్చింది సునందమ్మ కొండయ్యను, వెంకటేశును కూర్చోమని చెప్పి మంచం వాల్చుతూ.

"వాడు మళ్లా రాత్రికేమన్నా వస్తాడామ్మీ?" అడిగాడు కొండయ్య.

"నాకేం చెప్పలేదు గదన్నా, సాకలోల్ల సుబ్బిగాడొస్తే గోయిందరాజుల సామి గుడికాడికి పొయ్యే దోవలో వుండే లాడ్జీలో వుంటానని చెప్పమన్నాడు" బదులిచ్చింది సునందమ్మ.

"సినిమావాల్లు నీకియ్యమని లెక్కవానిచేతికి ఇచ్చివుంటే దానికీ, దీనికీ దుబారా చేస్తాడేమో మామా, తొందరగా వాన్ని పట్టుకోవల్ల" సునందమ్మకు వినబడకుండా మెల్లగా గొణిగాడు వెంకటేశు. అది కూడా నిజమేననిపించడంతో మరో గంటకంతా తిరుపతిలో బస్సు దిగి సునందమ్మ చెప్పిన లాడ్జివద్దకు చేరుకుని సినిమావాళ్ళ గురించి వాకబు చేశారు. యూనిట్‌లోని ముఖ్యమైనవారంతా స్వామి దర్శనార్థం తిరుమల వెళ్ళారని, మరికొందరు రూముల్లోనే వున్నట్లుగా చెప్పిన లాడ్జివారు తాము కనుక్కోలేమని మీరే రూమువద్ద వదలండని వెంకటేశు అడగడంతో రూమ్‌బాయ్ సినిమావాళ్ళున్న గదివద్ద వీళ్ళిద్దరినీ వదిలివెళ్ళిపోయాడు. గది లోపల నలుగురు ఏదో బిగ్గరగా మాట్లాడుకుంటున్నట్లుగా వినిపించడంతో పాటుగా వారిలో సాంబయ్య కూడా వున్నట్లు గుర్తించాడు కొండయ్య.

గది తలుపులు మూసి వుండడంతో తెరవాల్సిందిగా కొద్దిసేపు ఇరువురూ శబ్దం చేశారుగానీ తలుపులు తెరుచుకోలేదు.

గదిలోనుండీ సిగరెట్ పొగలతో పాటుగా గాజుగ్లాసుల చప్పుళ్ళు, బిగ్గరగా నవ్వడం వంటి శబ్దాలు వినిపించడంతో ప్రక్కనే ఓ వారగా తెరిచివున్న కిటికీ గుండా లోనికి తొంగిచూశారు కొండయ్య, వెంకటేశులు.

అప్పటికే మత్తు బాగా తలకెక్కినట్లుంది కాబోలు తూలుతూనే చేతిలోని బాటిల్‌లో వున్న విస్కీని మిగతావారి గ్లాసుల్లో నింపుతూ "ఒరేయ్ మా మామ నిజంగానే పిచ్చోడేరా, ఏదో ఓ రెండు గంటలసేపు సినిమా షూటింగ్ తీసుకునేందుకు లక్ష రూపాయలు ఇప్పిస్తానంటే నమ్మేశాడు" మాటలు సాంబయ్య నోటివెంట ముద్దుముద్దుగా వస్తున్నాయి.

తాము చూస్తున్నదీ, వింటున్నదీ కలో, వాస్తవమో అర్థంగాని కొండయ్య వెంకటేశుల గుండెల్లో నుండీ ఎగదన్నుకుని వస్తున్న కోపాన్ని అలాగే అదిమిపెట్టుకుని ఇంకా ఏం మాట్లాడుతాడోనని అలాగే గుడ్లప్పగించి చూస్తున్నారు.

"నువ్వెన్నయినా చెప్పు శంభుప్రసాద్, కనీసం యాభై వేల రూపాయలు కళ్ళ జూడాల్సిన పంట మన షూటింగ్ కారణంగా పూర్తిగా నేలపాలయ్యింది, డైరక్టర్‌కు చెప్పి ఎంతో కొంత డబ్బు ఇప్పించి వుంటే బావుండేది" అన్నాడు మరో యువకుడు సిగరెట్ పొగను రింగులు రింగులుగా గాల్లోకి వదులుతూ.

"భలే చెప్పావు లేవయ్యా, మన షూటింగ్ కారణంగా నేలపాలయిన పంటకోసం మా మామయ్యకు పరిహారం ఇవ్వమని అడిగితే డైరక్టర్‌గారి దగ్గర నాకు 'తగిన గుర్తింపు', 'విలువ' ఏముంటాయ్?" మళ్ళీ పగలబడి నవ్వుతూ కొట్టిపారేశాడు శంభుప్రసాద్.

"నువ్వు అంటున్నదేమిటో నాకు అర్థంగావడంలేదు" సందేహం వ్యక్తం చేశారు మరో యువకుడు.

"ఈ సినిమా రంగంలో ఎవరిని ఎప్పుడు ఎలా వుపయోగించు కోవాలో తెలియడంవల్లనే పదేళ్ళక్రితం లైట్‌బాయ్‌గా చేరిన మహేంద్ర నాథ్ ఈరోజు డైరక్టర్ స్థాయికి ఎదిగాడు, లేకుంటే నీలాగా ఇప్పటికీ లైట్‌బాయ్‌గానే వుండేవాడు" గ్లాసుల్లోకి మరో రౌండు విస్కీ వొంపుతూ చెప్పాడు సాంబయ్య, ఏదో రహస్యం చెబుతున్నవాడిలా.

"మేము అడుగుతున్నదానికీ నీవు చెబుతున్నదానికీ ఏమాత్రం పొంతనే లేదే" గిరజాల జుట్టున్న మరో కుర్రాడు ప్రశ్నించాడు.

"రెండు నెలలపాటు కాళ్ళరిగేలా తిరిగినా కనికరించని డైరక్టర్ తన అవసరం గడుపుకునేందుకు నన్ను తనకు అనుకూలంగా మలుచుకున్నాడు మిత్రమా, అదేవిధంగా నేను కూడా సినిమాల్లో నటించే ఛాన్సు కోసం నా అవసరాన్ని తీర్చుకునేందుకు మా మామయ్యను వుపయోగించుకున్నాను" సిగరెట్ పీకను గదిమూలకు విసరికొడుతూ చెప్పాడు శంభుప్రసాద్. మిగతా ముగ్గురూ విభ్రమంగా చూశారు శంభుప్రసాద్ వైపు.

"ఒరేయ్ మా మామ నిజంగానే పిచ్చోడేరా, ఏదో ఓ రెండు గంటలసేపు సినిమా షూటింగ్ తీసుకునేందుకు లక్ష రూపాయలు ఇప్పిస్తానంటే నమ్మేశాడు"



"మీ మొద్దుబుర్రలకు ఇంకా అర్థం కానట్లుందిగానీ ఎలాగైనా డైరక్టర్ అవసరం తీరింది, నాకు సినిమాల్లో నటించే అవకాశం రాబోతోంది గదా" మళ్ళీ తనే చెప్పాడు సాంబయ్య మరో సిగరెట్ వెలిగించుకుంటూ.

"మీ మామయ్యను మోసం చేసినట్లు కాదా?" అడిగాడు గిరజాల జుట్టు కుర్రాడు.

"మా మామయ్యను మోసం చేస్తున్నానని బాధపడుతూ కూర్చుంటే ఎలా కుమార్, క్రిందివాళ్ళను నిచ్చెనమెట్లుగా చేసుకుని పైకి ఎగబ్రాకాలనే రీతిలో డైరక్టర్‌గారు నా విషయంలో అనుసరించిన సూత్రాన్నే నేను కూడా అనుసరించబట్టే కదా ఆయన దగ్గర మార్కులు కొట్టేసే అవకాశం దక్కింది" మరింత విశదీకరించినట్లు చెప్పాడు సాంబయ్య అలియాస్ శంభుప్రసాద్. గది ఇవతల కిటికీ గుండా లోపలికి చూస్తూ గుడ్లప్పగించి వింటున్న వెంకటేశుకు ఈ మాటలన్నీ అర్థం అవుతున్నాయిగానీ కొండయ్యకు ఏమాత్రం వినిపించడంలేదు. ఎందుకంటే మేనల్లుడు చేసిన మోసాన్ని గ్రహించి అతడి అభివృద్ధికి నిచ్చెన మెట్టుగా వుపయోగపడిన కొండయ్య గుండె అప్పటికి ఓ పది సెకన్లక్రితమే ఆగిపోయింది కాబట్టి.